తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం - 16 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 162 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులివ్వండి..

తెలంగాణకు అండగా నిలవండి!



- **ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**
- **తుమ్మిడిహెట్టి నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని అభ్యర్థన..**
- **సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల అదనపు నిధులు ఇవ్వాలని వినతి..**
- **పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరిన సీఎం**

ఢిల్లీ, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు అంతరాష్ట్ర జలవివాదాల పరిష్కారానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేశామని, భూసేకరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం త్వరితగతిన అందజేస్తున్నామని వివరించారు. ఢిల్లీలోని ప్రధానమంత్రి అధికారిక నివాసంలో మోదీతో ముఖ్యమంత్రి సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

మిగతా 2 లో..

ఖేలో ఇండియా యువజన క్రీడలకు తెలంగాణ ముస్తాబు!



- **అధికారిక చిహ్నం, మస్కట్‌లను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ**
- **డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీలు.. 27 క్రీడాంశాల్లో 7 వేల మందికి పైగా క్రీడాకారుల ప్రతిభాప్రదర్శన**
- **మూడేళ్లలో క్రీడా బడ్జెట్ రూ.113 కోట్ల నుంచి రూ.465 కోట్లకు పెంపు**

ఢిల్లీ, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ వేదికగా నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యువజన క్రీడలు-2026కు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఈ క్రీడా సంబరాలకు సంబంధించిన అధికారిక చిహ్నం, మస్కట్‌లను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఆవిష్కరించారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి అధికారిక నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు పలువురు ఉన్న తాధికారులు పాల్గొన్నారు.

మిగతా 2 లో..



మహిళలు ఆర్థికంగా ఎదిగి.. వ్యాపారవేత్తలుగా నిలవాలి

- **మహిళా సంఘాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది**
- **మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం**
- **రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

మల్లారెడ్డిపల్లి, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది, వ్యాపారవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం, మహిళా సమాఖ్య భవనాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణితో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, గత మూడేళ్లలో బ్యాంకు అనుసంధానం, స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు సుమారు రూ.70 వేల కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు.

మిగతా 2 లో..

కాంగ్రెస్, బీజేపీ నేతల తీరు తెలంగాణ ఆత్మగౌరవానికి భంగం: కేటీఆర్

- **జాతీయ పార్టీల నాయకులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ విమర్శలు**
- **గాంధీ కుటుంబం వద్ద సీఎం రేవంత్ వ్యవహారశైలిపై వ్యాఖ్యలు**
- **అమిత్ షా పర్యటన సందర్భంగా బీజేపీ నేతల తీరుపై ఆక్షేపణ**
- **ప్రజలు ఇచ్చిన పదవుల గౌరవాన్ని కాపాడాలని హితవు**



హైదరాబాద్, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నాయకుల వ్యవహారశైలిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఆయా పార్టీల్లో కీలక పదవుల్లో ఉన్న నాయకులు తమ హోదాకు తగిన హుందాతనం, గౌరవాన్ని పాటించడం లేదని ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన పదవుల గౌరవాన్ని దిగజార్చేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జాతీయ పార్టీల నాయకుల ముందు రాష్ట్రానికి చెందిన నేతలు వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ఆత్మ గౌరవం దెబ్బతింటోందని

మిగతా 2 లో..


కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను

ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి

- **నాంపల్లి పార్టీ కార్యాలయంలో అన్ని సెల్స్ సమావేశం**
- **రాబోయే పార్టీ కార్యక్రమాలపై కార్యకర్తలకు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు దిశానిర్దేశం**
- **ప్రధాని మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని సూచన**
- **కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపు**

హైదరాబాద్, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ అన్ని సెల్స్ సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాలు, ప్రజల్లోకి వెళ్లాల్సిన అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులు



మిగతా 2 లో..

దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా

సహాయ ఉపకరణాలు

- **నేటి నుంచి హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రత్యేక శిబిరాలు**
- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందించడమే లక్ష్యం**
- **రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):

హుస్నాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా సహాయ ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నవంబర్ 16 నుంచి 27వ తేదీ వరకు నియోజకవర్గంలోని ఏడు మండలాలు, హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. నడవడానికి, వినడానికి, చూడడానికి, నిత్యావసర పనులు చేసుకోవడానికి ఎవరి సహాయం కోసం ఎదురుచూడకుండా

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులివ్వండి..

తెలంగాణకు అండగా నిలవండి!



(మొదటి పేజీ తరువాయి)

తుమ్మిడిహెట్టికి మహారాష్ట్రను ఒప్పించండి

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ప్రధానమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో జరిగిన సమావేశం వివరాలను ప్రధానికి వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలోని వెనుకబడిన, గిరిజన ప్రాంతాలకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు గురుత్వాకర్షణ శక్తి ద్వారా నీటిని వినియోగించుకునే అవకాశం ఈ ప్రాజెక్టుతో కలుగుతుందని వివరించారు.

పెండింగ్ అనుమతులు వెంటనే మంజూరు చేయాలి

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టు, డిండి ఎత్తిపోతల పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం భారీగా వ్యయం చేసినప్పటికీ పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో ఆశించిన ప్రయోజనాలు అందడం లేదని సీఎం ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పర్యావరణ అనుమతుల విషయంలో ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన సానుకూల తీర్పు నేపథ్యంలో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణకు అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వండి

రాష్ట్రంలో 70 నుంచి 90 శాతం వరకు పనులు పూర్తయిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రత్యేక పెట్టుబడి సహాయ పథకం కింద అదనంగా రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే నిధులు విడుదల చేస్తే కొత్త ఆయకట్టుతో పాటు ఇప్పటికే ఉన్న ఆయకట్టుకు స్థిరీకరించిన సాగునీటి సరఫరా అందించేందుకు వీలవుతుందని వివరించారు. తద్వారా రైతుల ఆదాయం, గ్రామీణ ఉపాధి అవకాశాలు, ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతాయని తెలిపారు.

సమ్మక్కసాగర్‌కు ఛత్తీస్‌గఢ్ సహకారం అవసరం

సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఇప్పటికే కేంద్ర జల సంఘానికి సమర్పించినట్లు ప్రధానికి వివరించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం, వెనుక జలాల మట్టం ఆధారంగా ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములు, గ్రామాలను గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహించి అందుకు రూ.9.88 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని, ఆ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం త్వరగా వచ్చేలా సహకరించాలని ప్రధానిని కోరారు.

కేంద్ర నిధుల కోసం సీఎం విజ్ఞప్తి

ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద పలు సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహకారం అందించాలని సీఎం కోరారు. సమగ్ర సమ్మక్కసాగర్ ప్రాజెక్టునీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.5,183 కోట్లు, మోడికుంట వాగు ప్రాజెక్టుకు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.171 కోట్లు, చనాకాకొరాటా బ్యారేజీకి రూ.103 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఖేలో ఇండియా యువజన క్రీడలకు ప్రధానికి ఆహ్వానం

మరోవైపు హైదరాబాద్‌లో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యువజన క్రీడల ప్రారంభ, ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను అందజేయడంతో పాటు క్రీడల చిహ్నం, మస్కట్‌ల గురించి వివరించారు. భవిష్యత్తులో ఆసియా క్రీడలు, ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించే యువ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఈ పోటీలు చక్కని వేదికగా నిలుస్తాయని తెలిపారు. 2002లో జాతీయ క్రీడలు, 2007లో ప్రపంచ మిలిటరీ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన అనుభవం తెలంగాణకు ఉందని ప్రధానికి వివరించారు.



ఖేలో ఇండియా యువజన క్రీడలకు తెలంగాణ ముస్తాబు!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లో ఖేలో ఇండియా క్రీడలు నిర్వహించేందుకు అవసరమైన క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. మొత్తం 27 క్రీడాంశాల్లో 7 వేల మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ పోటీలు గొప్ప వేదికగా నిలవనున్నాయని పేర్కొన్నారు.

క్రీడా బడ్జెట్‌కు భారీగా పెంపు

రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. గత మూడేళ్లలో రాష్ట్ర క్రీడా బడ్జెట్‌ను రూ.113 కోట్ల నుంచి రూ.465 కోట్లకు పెంచినట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు.

61 మినీ స్టేడియాల నిర్మాణం పూర్తి

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 61 మినీ స్టేడియాల నిర్మాణం పూర్తయిందని, మరో 15 స్టేడియాల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సాధన సౌకర్యాలు కల్పించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు రాణించేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. ఖేలో ఇండియా యువజన క్రీడల నిర్వహణతో తెలంగాణ క్రీడారంగానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు యువ ప్రతిభకు కొత్త అవకాశాలు అందనున్నాయి.

మహిళలు ఆర్థికంగా ఎదిగి.. వ్యాపారవేత్తలుగా నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

మహిళలకు అందించే రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు. గతంలో పొదుపు, కుటుంబ అవసరాలకే పరిమితమైన మహిళా సంఘాలు నేడు వివిధ రంగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నాయని అన్నారు. మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ.3 కోట్ల రుణాలు అందించగా, కేవలం పది రోజుల్లో రూ.6 కోట్ల ఆదాయం ఆర్జించారని వివరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సరస్ మేళాలో మహిళలు తయారుచేసిన ఉత్పత్తుల విక్రయాల ద్వారా పది రోజుల్లో సుమారు రూ.10 కోట్ల ఆదాయం పొందారని తెలిపారు.

మహిళలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, బస్సుల కొనుగోలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా గత వానాకాలం సీజన్‌లో మహిళా సంఘాలకు సుమారు రూ.160 కోట్ల కమీషన్ ఆదాయం వచ్చిందన్నారు. మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ యూనిట్లు, గోదాములు, ఇందిరా మహిళా శక్తి భవనాలు, క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించామని, వీటి ద్వారా మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రజలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు బీమా సదుపాయాలు కల్పిస్తున్నామని, మరణించిన సభ్యుల రుణాలను మాఫీ చేస్తున్నామని తెలిపారు. మహిళల ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూ ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ఒంటరి మహిళలు, భర్తను కోల్పోయిన మహిళలు, దివ్యాంగులను గుర్తించి కొత్త పింఛన్లు అందించేందుకు సర్వే నిర్వహించామని, సుమారు 4.5 లక్షల మంది అర్హుల తుది జాబితా సిద్ధమైందని తెలిపారు. ఈ నెల 19వ తేదీ తర్వాత వారి బ్యాంకు ఖాతాల్లో పింఛన్ డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు.

మల్లారెడ్డిపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవనం నిర్మించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీ రోడ్లు, రూ.3.50 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, మహిళలు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో ప్రజలకు మేలు చేస్తున్నామని చెప్పారు. మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు తదితర అర్హులైన వర్గాలకు కొత్తగా 4.5 లక్షల పింఛన్లు మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రానికి భారీగా అప్పులు ఉన్నప్పటికీ బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తోందన్నారు. మహిళలకు పెద్దపీట వేయడం వల్ల గతంలో పురుషులు నిర్వహించిన అనేక వ్యాపారాలను నేడు మహిళలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపేదలకు సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, కొత్త పింఛన్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక భవనాలు నిర్మిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో మహిళా క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, ఇతర వ్యాపార అవకాశాలు కల్పిస్తూ వారికి ఆర్థిక భరోసా అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో జీవించేలా అవసరమైన సహాయ ఉపకరణాలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, తన ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని ఏడీఐపీ పథకం కింద భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ సహకారంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాల్లో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు మోటారు ట్రైసైకిళ్లు, చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలు, చేతికర్రలు, కళ్లద్దాలు, నడకకు ఉపయోగపడే ఇతర సహాయక పరికరాలను ఉచితంగా అందించనున్నారు. 80 శాతానికి పైగా వైకల్యం ఉన్న అర్హులకు విద్యుత్‌తో నడిచే ట్రైసైకిళ్లు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

శిబిరాల నిర్వహణ వివరాలు:

* నవంబర్ 16, సోమవారం: సైదాపూర్ మండలం - ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణం.
* నవంబర్ 17, మంగళవారం: ఎల్కతుర్తి మండలం - ఎస్.ఎం.ఆర్. ఫంక్షన్ హాల్, వరంగల్ రోడ్డు.
* నవంబర్ 18, బుధవారం: అక్కన్నపేట మండలం - రైతుబజార్ / ఉన్నత పాఠశాల.
* నవంబర్ 20, శుక్రవారం: కోహెడ మండలం - లక్ష్మీ గార్డెన్.
* నవంబర్ 21, శనివారం: చిగురుమామిడి మండలం - మహాలక్ష్మి ఫంక్షన్ హాల్, చిన్నముల్కనూరు.
* నవంబర్ 25, బుధవారం: హుస్నాబాద్ గ్రామీణ ప్రాంతం - మున్సిపాలిటీ.
* నవంబర్ 26, గురువారం: హుస్నాబాద్ పట్టణం - మున్సిపాలిటీ.
* నవంబర్ 27, శుక్రవారం: భీమదేవరపల్లి మండలం - ప్రభుత్వ ఉన్నత పాఠశాల.

అన్ని శిబిరాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు.

అర్హులకు సమాచారం చేరవేయాలి

నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాలు, మండలాల పరిధిలోని అర్హులైన దివ్యాంగులు, వృద్ధులను గుర్తించి శిబిరాల వివరాలను వారికి తెలియజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత తేదీల్లో ఉదయం 10 గంటలకు సంబంధిత శిబిరాలకు హాజరయ్యేలా ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లోని అర్హులందరికీ ఈ పథకం ద్వారా ప్రయోజనం కలిగేలా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏ ఒక్క దివ్యాంగుడు, వృద్ధుడు కూడా సహాయం అందక ఇబ్బందులు పడకూడదని, ప్రతి ఒక్కరికీ అవసరమైన ఉపకరణాలు అందించి స్వతంత్రంగా, ఆత్మగౌరవంతో జీవించేలా చేయడమే తమ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు చేరువ కావాలని సూచించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని రామచందర్‌రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి చర్యల సమాచారాన్ని కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా ప్రతి ఇంటికీ చేరవేయాలని సూచించారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని రామచందర్‌రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజలకు చేసిన వాగ్దానాలు, వాటి అమలులో జరుగుతున్న జాప్యం, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు.



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీజేపీ ఆరోపిస్తున్న అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.

రాబోయే పార్టీ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. ప్రతి సెల్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రచారం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల తరపున ప్రశ్నించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు, అన్ని సెల్స్ సమన్వయకర్త అమర్‌నాథ్ సారంగుల, వివిధ విభాగాలకు చెందిన నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. రాబోయే కార్యక్రమాల నిర్వహణ, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై సమావేశంలో చర్చించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వివరించడం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నాయకులు నిర్ణయించారు.

కాంగ్రెస్, బీజేపీ నేతల తీరు తెలంగాణ ఆత్మగౌరవానికి భంగం



(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని ప్రస్తావిస్తూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. గాంధీ కుటుంబానికి బాడీగార్డుల్లా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ బైక్ వెనుక కాంగ్రెస్ మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు పరుగులు తీయడం రాష్ట్ర నాయకుల హోదాకు తగిన విధానం కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి ముఖ్యమైన పదవుల్లో ఉన్నవారు తమ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకుల వ్యవహారశైలిపైనా కేటీఆర్ ఆక్షేపణ వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన సందర్భంగా తెలంగాణకు చెందిన ఒక కేంద్ర మంత్రి ఆయన చెప్పులు మోశారని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆయన కాళ్లు మొక్కారని ఆరోపించారు. రాష్ట్రానికి చెందిన నాయకులు జాతీయ స్థాయి నేతల ముందు ప్రదర్శిస్తున్న ఈ తరహా వైఖరి ప్రజలు ఇచ్చిన పదవుల గౌరవాన్ని తగ్గించేలా ఉందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ నేతల తీరు అత్యంత సిగ్గుచేటుగా, అవమానకరంగా ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు తమ నాయకులకు అప్పగించిన బాధ్యతలు, పదవులు వ్యక్తిగత విధేయతను ప్రదర్శించేందుకు కాదని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన నాయకులు తమ హోదాకు తగిన గౌరవాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. జాతీయ పార్టీల నాయకుల పట్ల చూపుతున్న విధేయత కంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాలని పరోక్షంగా హితవు పలికారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమే ఆత్మగౌరవ పునాదులపై జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల గౌరవం, స్వాభిమానం తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన విలువలని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ జాతీయ నాయకత్వాలు ఈ విలువలను అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రానికి చెందిన నాయకులు తమ పదవుల గౌరవాన్ని కాపాడుకుంటూ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సోమవారం - 16 - నవంబర్ 2026

వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించాలి

- పంచాయతీ కార్యదర్శి వెంకటేష్




పెద్దమందడి,నవంబర్15(తెలంగాణ ముచ్చట్లు): ఎల్‌నినో ప్రభావంతో వర్ష పాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యం లో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని, వర్షపు నీటిని వృథా చేయకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంట పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ సూచించారు. దొడగుంట పల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపించడం వల్ల భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తులో నీటి ఎద్దడి సమ స్యను కొంతవరకు నివారించవచ్చని తెలిపారు.ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టి భవిష్యత్తు తరాలకు నీటి వనరులను అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు.

కిలో మటన్‌కు పావు కిలో కొవ్వు ఇస్తారా?

- కిలోకు రూ.800 చెల్లించినా నాణ్యమైన మటన్ అందించరా?
- వినియోగదారుడు నక్కల భాస్కర్ ఆవేదన




పెద్దమందడి,నవంబర్15(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో మటన్ కొనుగోలుపై వినియోగదారుడు నక్కల భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఓ మటన్ షాప్ దగ్గర కిలో మటన్‌కు రూ.800 చెల్లించి కొనుగోలు చేసినప్పటికీ, మాంసం తక్కువగా వేసి పావు కిలో వరకు కొవ్వు కలిపి ఇచ్చారని ఆరోపించారు.అధిక ధరలు చెల్లించి మటన్ కొనుగోలు చేస్తున్న వి నియోగదారులకు నాణ్యమైన మాంసం అందించాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. మటన్ పేరుతో కొవ్వు ఎక్కువగా ఇవ్వడం వల్ల వినియోగదా రులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కిలోకు రూ.800 వసూలు చేస్తున్నప్పు డు మాంసం తగ్గించి కొవ్వు ఎక్కువగా ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్ర శ్నించారు. మటన్ వ్యాపారులు వినియో గదారుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సరైన తూకంతో నాణ్యమైన మాంసాన్ని అందించాలని నక్కల భాస్కర్ కోరారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి చిన్నారెడ్డి

పెద్దమందడి,నవంబర్15(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి మల్లయ్య, చిన్న నాగమ్మ దంపతుల కుమారుడు వినోద్ కుమార్ వివాహ వేడుకకు మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్, లోకేశ్వరి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ సందర్భం గా చిన్నారెడ్డి మాట్లాడుతూ నూతన వధూవరుల వైవాహిక జీవితం ప్రేమా నురాగాలు, ఆనందం, సుఖసంతో షాలతో నిండాలని ఆకాంక్షించారు. దంపతులు జీవితాంతం పరస్పర అవగాహనతో, అన్యోన్యంగా జీవిం చాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్ర మంలో గ్రామ మాజీ సర్పంచ్ మన్నెం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గట్టు దయాకర్, సతీష్ యాదవ్, రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, రామ్ నరేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలనే ఆకాంక్షతో కోమాకుల నాగరాజు సైకిల్ యాత్ర!



వేలేరు, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో సైకిల్ యాత్ర చేపడుతు న్న కోమాకుల నాగరాజును వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ఎర్ర గొల్ల సుశాంత్ యాదవ్ అలియాస్ చెర్రీ కలిసి అభినందించారు.

ఈ సందర్భంగా నాగరాజుకు పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చేపట్టిన సైకిల్ యాత్ర గురించి తెలుసుకుని అభినంద నలు తెలియజేశారు.

వీపనగండ్లలో గద్దర్ విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు

- వలస శంకర్ గౌడ్ జిల్లా సాహితి కళావేదిక అధ్యక్షులు



వనపర్తి,నవంబర్15(తెలంగాణ ముచ్చట్లు): ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహాన్ని వీపనగండ్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం అభినం దనీయమని సాహితీ కళా వేదిక జిల్లా అధ్య క్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. నవంబర్ 19, గురువారం గద్దర్ విగ్రహాన్ని ఆవిష్కరిం చనున్న నేపథ్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో ని అంబేద్కర్ చౌరస్తాలో విగ్రహ ఆవిష్కరణ పోస్టర్‌ను వివిధ ప్రజా సంఘాల నాయకుల తో కలిసి విడుదల చేశారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. పేదల గొంతుకగా, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా గద్దర్ తన జీవితాంతం పాటల ద్వారా ప్రజ లను చైతన్యపరిచారని అన్నారు. తెలంగాణ ఉద్యమంతో పాటు అనేక ప్రజా ఉద్యమాల్లో ఆయన పాటలు ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపాయని పేర్కొన్నారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఎతం కృష్ణయ్య మాట్లాడుతూ డప్పు కొట్టి, పాట పాడి ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప ప్రజా కళాకారుడు గద్దర్ అని కొని యాడారు. డీటీఎఫ్ నాయకుడు యోసేఫ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాటలు వేలాది మందిని కదిలించాయని అన్నారు. డప్పు స్వామి మాట్లాడుతూ గద్దర్ అంటే ఒక పేరు మాత్రమే కాదని, ఒక ఉద్య మమని, ఒక చరిత్ర అని పేర్కొన్నారు.గంధం నాగరాజు మాట్లాడుతూ గద్దర్ విగ్రహ ఏర్పాటు ద్వారా భావితరాలకు ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి అందుతాయని అన్నారు. బండారు శ్రీనివాస్ యువత గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పి లుపునిచ్చారు. నిరంజనయ్య మాట్లాడుతూ వీపనగండ్ల ప్రజలంతా ఐక్యంగా విగ్రహ ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయమ ని తెలిపారు. గద్దర్‌కు ఇది నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు ఎతం కృష్ణయ్య, జైభీమ్ సేవా సంఘం అధ్యక్షుడు బండారు శ్రీనివా స్, ఎడ్డుల యాదగిరి, అగ్గి రాములు, కళ్యాణ్, నరసింహ, చెన్నకేశవులు, చినరాములు, గో పాలకృష్ణ, డప్పు స్వామి, గంధం నాగరాజు, పెరుమల శ్రీనివాస్, కురుమూర్తి, గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

భారత్‌లో సైలెంట్ కిల్లర్‌గా మారుతున్న మధుమేహం

- ప్రజలు జీవనశైలి మార్పులతో మధుమేహాన్ని నియంత్రించుకోవాలి : మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు): ప్రపంచ మానవాళికి, ముఖ్యంగా భారతీయులకు మధుమేహ వ్యాధి నిశ్శ బ్ద హంతకిగా మారుతున్న నేపథ్యంలో ప్రజలు దీనిపట్ల అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. మధుమేహం బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడంతో పాటు ఆహార నియమాలు, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం పాటించాలని సూచించారు. భారత్‌లో దాదాపు 100 మిలియన్ల మంది మధుమేహంతో బాధప డుతుండటం ఆందోళనకరమని, దీనిని ప్రతి ఒక్కరూ హెచ్చరికగా తీసుకోవాలని పేర్కొ న్నారు. ఆదివారం కరీంనగర్ పట్టణంలో లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన మధుమేహ వ్యాధి అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మధుమేహంపై ప్రజల్లో అవ గాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

లయన్స్ జిల్లా గవర్నర్ మోరె భద్రేశం మాట్లాడుతూ జిల్లా 320జీ పరిధిలోని వందకు పైగా లయన్స్ క్లబ్బులు నవంబర్ మాసంలో మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త లయన్ గుండోజు లక్ష్మయ్య నాయకత్వంలో తెలంగాణ కూడలి వద్ద ప్రా రంభమైన ర్యాలీ బస్‌స్టాండ్ మీదుగా టవర్ సర్కిల్ వరకు కొనసాగింది.

ర్యాలీలో పాల్గొన్న లయన్స్ సభ్యులు మధుమేహ నివారణపై నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నగర ప్రజల్లో అవ గాహన కల్పించారు. టవర్ సర్కిల్ వద్ద గుమిగూడిన ప్రజలకు మధుమేహ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ఆరోగ్యకర మైన జీవనశైలి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పీడీజీ హెచ్. రాజిరెడ్డి, సీనియర్ లయన్స్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కరీంనగర్ పరిసర ప్రాం తాల్లోని వివిధ లయన్స్ క్లబ్బుల సభ్యులు, పీఎస్‌టీలు, జెడ్సీలు, ఆర్సీలు, పీఆర్సీలు, పీజెడ్సీలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజ యవంతం చేయడంలో లయన్స్ సభ్యులు సహకరించారు.





ఘనంగా కళాశాల స్వర్ణోత్సవాలు.. చరిత్రలో చిరస్థాయిగా నిలవాలి!

- పూర్వ విద్యార్థులంతా ఐక్యంగా భాగస్వాములు కావాలి.
- యాభై ఏళ్ల విద్యా ప్రస్థానాన్ని పండుగలా జరుపుకుందాం.
- ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. గోపి.

సత్తుపల్లి, నవంబరు 15 (తెలంగాణ ముచ్చట్లు): ఐదు దశాబ్దాల విద్యా ప్రస్థానానికి ప్రతీకగా నిలిచిన జలగం వెంగళరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుక లను అంగరంగ వైభవంగా నిర్వహించి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా తీర్చిదిద్దాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. గోపి పిలుపునిచ్చారు. ఈ కళాశాలలో చదువుకుని వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకున్న పూర్వ వి ద్యార్థులంతా ఒక్కటై, తమ విద్యాసంస్థ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసేలా స్వర్ణోత్సవాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కళాశాల స్వర్ణోత్సవాల నిర్వహణకు సంబంధించి నాలుగో సన్నా హక సమావేశం ఆదివారం కళాశాల సెమినార్ హాలులో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. గోపి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరై వేడుకల నిర్వహ ణపై తమ అభిప్రాయాలు, సూచనలు అందించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడు తూ.. ప్రతి ఒక్కరి జీవితంలో తాము చదువుకున్న పాఠశాల, కళాశాలకు ప్రత్యేక స్థానం ఉంటుందని, విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహాలు, అనుబంధాలు జీవితాంతం మధుర జ్ఞాపకాలుగా మిగిలి పోతాయని అన్నారు. అలాంటి అపురూప జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, యాభై ఏళ్ల సుదీర్ఘ విద్యా ప్రస్థానాన్ని ఘనంగా వేడుక చేసుకునే అవకాశం రావడం ఎంతో ప్రత్యేకమన్నారు. స్వర్ణోత్సవాలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి, కళాశాల అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేసే వేదికగా నిలవాలని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, ప్రస్తుతం వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతు న్న వారంతా తమ విద్యాసంస్థకు అండగా నిలవాలని కోరారు. స్వర్ణోత్సవాల నిర్వహ ణను ఒక్కరి బాధ్యతగా కాకుండా కళాశా లలో చదువుకున్న ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. అందరి సమష్టి కృషి, సహకారం, ఐక్యతతో ఈ వేడుకలను ఎప్పటికీ గుర్తుండిపోయేలా నిర్వహించ వచ్చని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం స్వర్ణోత్సవాల నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణ, ప్రముఖులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించడం, సాంస్కృ తిక కార్యక్రమాలు, ఇతర ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. వేడుకల నిర్వహణలో పూర్వ విద్యార్థులందరికీ భాగస్వామ్యం కల్పించేలా వివిధ కమిటీ లను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించే అంశాన్ని చర్చించారు. డిసెంబర్ నెలలో స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. పూర్తి స్థాయి ఏర్పాట్లు, కార్యక్రమాల ఖరారు కోసం మరో రెండు సన్నాహక సమావేశా లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పూర్వ విద్యార్థులందరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ పూర్ణచంద్రరావు, పూర్వ విద్యార్థి సంఘ సభ్యులు దారా కృష్ణారా వు, మానవతారాయ్, నరసింహారెడ్డి, ఫయాజ్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా గ్రామ ముద్దుబిడ్డ.. రూ.10 వేల ఆర్థిక సాయం!

వేలేరు, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు): ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ షోడశపల్లి గ్రామానికి చెందిన మామిడాల మహేందర్ రెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన భాషబోయిన రాజు మరణించిన విషయం తెలుసుకున్న ఆయన, వెంటనే మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయి విషాదంలో ఉన్న బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.10,000 నగదు ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచి భరోసా కల్పించారు.ఇతరుల కష్టాన్ని తమ కష్టంగా భావించి స్పందించడం గొప్ప మానవత్వమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందించిన మామిడాల మహేందర్ రెడ్డికి భాషబోయిన రాజు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



రెడ్డిపల్లి ఆధ్యాత్మిక వేడుకకు ప్రణవ్ బాబు భారీ విరాళం

వీణవంక, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ జిల్లా వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామంలో భూలక్ష్మి, మహాలక్ష్మి బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవానికి హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు రూ.2,00,116 విరాళంగా అందజేశారు. గ్రామ సర్పంచ్ కర్ర విజయ భగవాన్ రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో ఈ విరాళాన్ని అందించారు.
ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ బొడ్రాయి తెలంగాణ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామానికి బొడ్రాయి నాభిశిలగా, గ్రామదేవతలకు ప్రతినిధిగా భావిస్తారని తెలిపారు. గ్రామం నడిబొడ్డున బొడ్రాయిని ప్రతిష్ఠించడం ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారానికి ప్రతీక అని అన్నారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదని, తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేడుక అని వివరించారు. ఇలాంటి వేడుకలు గ్రామ ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.
భూలక్ష్మి, మహాలక్ష్మి అమ్మవార్ల ఆశీస్సులతో రెడ్డిపల్లి గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరిసి పాడిపంటలతో సమృద్ధిగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, గంగాడి తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, సునీల్, సాహెబ్ హుస్సేన్, వావినిల సత్యనారాయణ, జడల శ్రీకాంత్, మేక శ్రీనివాస్, ఐలయ్య యాదవ్, నల్ల కొండల్ రెడ్డి, సంపత్ అడిగొప్పుల, హరీష్ రెడ్డి, అనిల్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, మోటం శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



విద్యార్థులను చూసేందుకు వస్తే.. ఎండలోనే నిరీక్షణ!

- **వేలేరు ప్రభుత్వ బాలుర రెసిడెన్షియల్ కళాశాల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం**
- **కనీసం నిరీక్షణ గదిలోనైనా అవకాశం కల్పించరా?**

వేలేరు, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు): విద్యార్థులను కలిసేందుకు వచ్చిన తల్లిదండ్రులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో వేలేరు మండల కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల సిబ్బంది తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కావడంతో దూర ప్రాంతాల నుంచి తమ పిల్లలను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. కళాశాల సిబ్బంది నిరీక్షణ గదిలో వేచి ఉండేందుకు అనుమతించకపోవడంతో ఎండలోనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.
చిన్నపిల్లలను వెంట తీసుకొచ్చిన తల్లిదండ్రులు ఎండలో నిలబడలేక తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులను కలిసేందుకు అనుమతి లేకపోతే లేదా సందర్శన సమయాల్లో ఏవైనా మార్పులు ఉంటే ముందుగానే సంబంధిత వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.దూర ప్రాంతాల నుంచి బస్సుల్లో ప్రయాణించి పిల్లలను చూసేందుకు వస్తున్నామని, తిరిగి వెళ్లేందుకు బస్సుల సమయాలను దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల వద్ద ఆలస్యం కావడంతో తిరుగు ప్రయాణంలో బస్సులు మిస్ అయ్యే ప్రమాదం ఉందని వాపోయారు.విద్యార్థుల తల్లిదండ్రుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కనీసం నిరీక్షణ గదిలోనైనా వేచి ఉండేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. విద్యార్థుల సందర్శనకు సంబంధించిన నిబంధనలు, సమయాలు, ఇతర వివరాలను ముందుగానే వాట్సాప్ గ్రూపుల ద్వారా తెలియజేయాలని కళాశాల సిబ్బందికి విజ్ఞప్తి చేస్తున్నారు.విద్యార్థుల సంక్షేమంతో పాటు వారి తల్లిదండ్రుల ఇబ్బందులను కూడా సంబంధిత అధికారులు గుర్తించి తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.





జిల్లాలో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన

- **పలు శుభ కార్యక్రమాలకు హాజరు**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 15(తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. తొలుత ఉదయం కూసుమంచి మండలం నేలపట్ల గ్రామంలో శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి పోతురాజు దేవాలయ విగ్రహం యంత్ర ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరై.. యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖమ్మ రూరల్ మండలం రెడ్డిపల్లిలో వేర్వేరు ఫంక్షన్ హాల్ లలో నిర్వహించిన.. ఇటికాల భాస్కర్ కుమారుడి వివాహ వేడుకకు, ఖమ్మం రూరల్ మండలం కస్నాతండాకు చెందిన అవిరేణి రవి (లేటు) కుమారుడి వివాహానికి, ఏఆర్ ఫంక్షన్ హాల్లో కడారి వారి వివాహ వేడుకకు వెళ్లి.. ఆశీర్వదించారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వరంగల్ క్రాస్ రోడ్ కు చెందిన సమ్మెట శేఖర్ కుమారుడి వివాహ వేడుకకు, ఖమ్మంలో సీనియర్ పాత్రికేయులు మైసా పాపారావు కుమార్తె వివాహ వేడుకకు, గాంధీచౌక్ వాస్తవ్యులు దేవరశెట్టి రామారావు కుమారుడి పెళ్లి వేడుకకు, అలాగే నగరంలో వేముల లక్ష్మణరావు కుమార్తె వివాహ వేడుకకు, ఖమ్మంలో మాజీ కార్పొరేటర్ నాగుల్ మీరా ఇంట్లో ఓ శుభ కార్యక్రమానికి వెళ్లి..హోటల్ అశోక్ లో జరిగిన వేడుకకు వెళ్లి ఆశీర్వదించారు. నూతన వస్త్రాలు అందించి దీవించారు. ఆయా కార్యక్రమాల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పలువురు సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





అభివృద్ధి.. సంక్షేమం జోడెడ్లుగా కాంగ్రెస్ పాలన

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు.. ప్రజా ప్రభుత్వ లక్ష్యం**
- **గత పాలకులు పింఛన్లు, రేషన్ కార్డులను, పేదోడి గూటిని పట్టించుకోలేదు**
- **కాళేశ్వరం పేరుతో.. కమీషన్ల పాలన చేసింది**
- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **తిరుమలాయపాలెం మండలంలో కొత్తగా 1,123 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 15(తెలంగాణ ముచ్చట్లు): అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి కొత్తగా మంజూరైన 1,123 చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను కలెక్టర్ దివాకర్ టీఎస్, కాంగ్రెస్ నేతలతో కలిసి మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించారని, పింఛన్లు, రేషన్ కార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు.
ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లపై క్వింటాకు రూ.500 బోనస్, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు మంజూరు చేస్తూ అండగా నిలుస్తున్నామని తెలిపారు.
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.40 వేల కోట్లు
మొదటి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, హైదరాబాద్‌లో పేదలకు మరో లక్ష ఇళ్లు కేటాయించామని మంత్రి వెల్లడించారు. ఈ నెలాఖరులోగా తుది బిల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మొత్తం రూ.40 వేల కోట్లతో ఎనిమిది లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయనున్నామని, మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.
పాలేరు నియోజకవర్గంలో అదనంగా 5,279 పింఛన్లు
తిరుమలాయపాలెం మండలంలో ఇప్పటికే 9,024 మందికి నెలకు రూ.2.99 కోట్ల పింఛన్లు అందుతున్నాయని, తాజాగా మరో 1,123 మందికి రూ.38.76 లక్షల విలువైన పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 37,039 మందికి రూ.8.69 కోట్ల పింఛన్లు అందుతుండగా, తాజాగా మరో 5,279 మందికి రూ.1.43 కోట్ల పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.
నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపాలిటీలో 968, కూసుమంచి మండలంలో 1,126, ఖమ్మం రూరల్ మండలంలో 882, నేలకొండపల్లి మండలంలో 1,175, తిరుమలాయపాలెం మండలంలో 1,123 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు వివరించారు.
మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
తిరుమలాయపాలెం మండల కేంద్రంలో రూ.26 కోట్లతో 100 పడకల ఆసుపత్రి, రూ.46 కోట్లతో ఐటీఐ కళాశాల నిర్మాణ పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గ్రామాల్లో సీసీ రహదారులు నిర్మించడంతోపాటు డొంకలు, మట్టి రహదారులను తారు రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్య, విద్యా సదుపాయాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి, మండల అధ్యక్షుడు కొప్పుల అశోక్, ఆత్మ కమిటీ పాలేరు నియోజకవర్గ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






శీనన్న పై అభిమానం ఉప్పొంగింది.. బైక్ ర్యాలీ హోరెత్తింది!

- **గొల్లగూడెం నుంచి ఖమ్మం వరకు.. పొంగులేటి శీనన్నకు జన నీరాజనం**
- **వేలాది బైకులతో కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ**
- **జై కాంగ్రెస్.. జై ఇందిరమ్మ ఇళ్ల శీనన్న నినాదాలతో మార్మోగిన రహదారులు**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 15(తెలంగాణ ముచ్చట్లు): అన్నపై అభిమానం ఉప్పొంగింది..బైకుల జోరు హోరెత్తింది..కాంగ్రెస్ పార్టీ జెండాలు రెపరెపలాడాయి.. జై కాంగ్రెస్.. జై ఇందిరమ్మ ఇళ్ల శీనన్న నినాదాలతో రహదారులు మార్మోగాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి... పాలేరు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల సంతోషం, హర్షం వ్యక్తం చేస్తూ.. ఆదివారం రాత్రి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో పండగ వాతావరణం నెలకొంది. గొల్లగూడెం నుంచి ఖమ్మం నగరంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్ వరకు వేలాది బైకులతో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నాయి.
తిరుమలాయపాలెం మండలం మీదుగా వస్తున్న మంత్రి పొంగులేటికి గొల్లగూడెం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి వేలాది బైకుల ర్యాలీ.. నినాదాల హోరుతో ముందుకు సాగింది. దారిపొడవునా పార్టీ శ్రేణుల ఉత్సాహం, అభిమానుల కోలాహలం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యకర్తల అభిమానం చూసి మంత్రి సైతం కారు రూఫ్‌టాప్‌పైకి చేరుకుని చేతులు ఊపుతూ అభివాదం చేశారు. వారి ఉత్సాహాన్ని మరింత పెంచుతూ ముందుకు సాగారు.ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా 968 మందికి ప్రభుత్వం చేయూత పథకం కింద పింఛన్లు మంజూరు చేసింది. అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసేందుకు మంత్రి పొంగులేటి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్లుగా చేసుకుని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
ఓవైపు పింఛన్ల మంజూరుతో లబ్ధిదారుల ఇళ్లలో ఆనందం.. మరోవైపు వేలాది బైకుల ర్యాలీతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం.. వెరసి మంత్రి పర్యటన ఏదులాపురంలో సందడి నింపింది.ఈ కార్యక్రమంలో.: మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ బాబు, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్ నాయక్, డివిజన్ల అధ్యక్షులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సోమవారం - 16 - నవంబర్ 2026

యువ జట్టుపై గంభీర్ ప్రశంసల జల్లు




ముంబై, నవంబరు 15 (తెలంగాణ ముచ్చట్లు): అండర్19 ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై భారత యువ క్రికెటర్లు అద్భుత విజయం సాధించడంపై టీమిండియా సీనియర్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించారు. చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో ఒక్క వికెట్ తేడాతో గెలిచి ఛాంపియన్లుగా నిలిచిన యువ ఆటగాళ్లను అభినందించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రత్యేక పోస్టు పెట్టారు.

''భయమెరుగని ఆట.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం.. పోరాట పటిమకు బ్యాటింగ్ ఆర్డర్‌తో సంబంధం లేదు..! ఆసియా ఛాంపియన్లుగా నిలిచారు. అద్భుతం కుర్రాళ్లూ!'' అంటూ గంభీర్ తన పోస్టులో పేర్కొన్నారు. కీలక సమయంలో వికెట్లు పడుతున్నా ఒత్తిడికి తలొగ్గకుండా పోరాడిన యువ ఆటగాళ్లను ఆయన ప్రశంసించారు. గంభీర్ చేసిన ఈ పోస్టు ప్రస్తుతం క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటోంది.

ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. దీంతో భారత్ ముందు 338 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. లక్ష్య ఛేదనలో భారత జట్టు ఒక దశలో 252 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో మనాల్ చౌహాన్, మొహిత్ ఉల్వా కీలకంగా పోరాడారు. ముఖ్యంగా మొహిత్ ఉల్వా 26 బంతుల్లో అజేయంగా 49 పరుగులు చేసి జట్టును విజయానికి చేరువ చేశాడు. చివరి బంతికి బౌండరీ సాధించడంతో భారత్ 339 పరుగులు చేసి ఒక్క వికెట్ తేడాతో గెలిచింది.

ఈ విజయంతో భారత యువ జట్టు తొమ్మిదోసారి అండర్19 ఆసియా కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. గ్రూప్ దశలో పాకిస్థాన్ చేతిలో ఎదురైన పరాజయానికి ఫైనల్లో బదులిచ్చింది. చివరి వరకు పట్టు దలతో పోరాడి జట్టుకు విజయాన్ని అందించిన యువ ఆటగాళ్లపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గంభీర్ అభినందనలు కూడా ఈ విజయానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి.

37 ఏళ్ల తర్వాత అదే బ్యాట్‌తో సచిన్



ముంబై, నవంబరు 15 (తెలంగాణ ముచ్చట్లు): క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు నవంబరు 15తో ప్రత్యేక అనుబంధం ఉంది. 16ఏళ్ల వయసులో ఇదే రోజున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆయన.. తన తొలి బ్యాట్‌తో ఉన్న మధుర జ్ఞాపకాలను మరోసారి అభిమానులతో పంచుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసి 37 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిన్ననాటి ఫొటోను తాజాగా మరోసారి పునఃసృష్టించారు. అప్పట్లో ఏ బ్యాట్‌తో ఫొటో దిగారో.. అదే బ్యాట్‌ను చేతిలో పట్టుకుని మరో ఫొటో దిగారు. ఈ చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్నతనంలో దిగిన ఫొటోలో ఉన్న బ్యాట్‌తోనే తాజాగా మరోసారి ఫొటో దిగిన సచిన్.. ''ఇదే నా తొలి బ్యాట్.. 49 ఏళ్లు గడిచినా ఇది నాతోనే ఉంది'' అంటూ ఆసక్తికర వ్యాఖ్యను జోడించారు. చిన్ననాటి నుంచి క్రికెట్‌పై తనకున్న మక్కువను గుర్తు చేసుకున్నారు. పొడవాటి జుట్టుతో, చేతిలో బ్యాట్ పట్టుకుని బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్న సచిన్ పాత ఫొటో క్రికెట్ అభిమానులకు సుపరిచితమే. ఇప్పుడు దశాబ్దాలు గడిచినా ఆ బ్యాట్‌ను భద్రంగా ఉంచుకోవడం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 1989 నవంబరు 15న పాకిస్థాన్‌తో కరాచీలో జరిగిన టెస్టు మ్యాచ్ ద్వారా సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టారు. అప్పటికి ఆయన వయసు కేవలం 16 ఏళ్ల 205 రోజులు మాత్రమే. అక్కడి నుంచి మొదలైన ఆయన ప్రస్థానం ప్రపంచ క్రికెట్‌లో ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. 37 ఏళ్ల క్రితం మొదలైన ఆ ప్రయాణం నేటికీ క్రికెట్ అభిమానులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. సుదీర్ఘ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో సచిన్ ఎన్నో అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో మొత్తం 34,357 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కొనసాగుతున్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో 100 సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా చరిత్ర సృష్టించారు. ఇందులో 51 టెస్టు సెంచరీలు, 49 వన్డే సెంచరీలు ఉన్నాయి. తన తొలి బ్యాట్‌తో దిగిన తాజా ఫొటో ద్వారా సచిన్ మరోసారి తన క్రికెట్ ప్రయాణంలోని మధుర జ్ఞాపకాలను అభిమానులకు గుర్తుచేశారు.





పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

• పాతర్లపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న వొడితల ప్రణవ్

ఇల్లంతకుంట, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం పాతర్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహం గృహప్రవేశ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెడుతున్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు అనేది ప్రతి నిరుపేద కుటుంబానికి చిరకాల స్వప్నమని, ఆ స్వప్నాన్ని నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు కేవలం ఇల్లు కల్పించడమే కాకుండా ఆత్మగౌరవంతో కూడిన జీవనానికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





ప్రజారోగ్యమే ధ్యేయంగా యంగ్ మైండ్స్ సేవా కార్యక్రమం

• వెంకటేశ్వర్లపల్లిలో 130 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు

జమ్మికుంట, నవంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు): జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో యంగ్ మైండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మైత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరానికి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన 130 మందికి పైగా ప్రజలు హాజరై వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట సీఐ, ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది హాజరై యువజన సంఘం సభ్యులను అభినందించి ప్రోత్సహించారు. వైద్య శిబిరం నిర్వహణకు సహకరించిన మైత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి, గ్రామ పెద్దలకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ యంగ్ మైండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

యువజన సంఘం ప్రారంభించిన తొలి సేవా కార్యక్రమమే ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడటం ఎంతో సంతోషంగా ఉందని సభ్యులు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో సేవ చేయడమే తమ సంఘం లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో యంగ్ మైండ్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లూరి సునీల్, సలహాదారు దొగ్గల రాజు, కోశాధికారి పుల్లూరి పవన్ సూర్యలాల్, కార్యనిర్వాహక సభ్యులు దొగ్గల ఆనంద్, పుల్లూరి పునీత్, బోయిని అరుణ్, దొగ్గల రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక కోటి సోమవారం.. శివాభిషేకంతో కోటి రెట్ల పుణ్యఫలం!

- నేడు శివాలయాలకు భక్తులు పోటెత్తే అవకాశం..
- ప్రత్యేక పూజలు, అభిషేకాలకు సిద్ధమవుతున్న భక్తులు
- కార్తీక సోమవారం విశిష్టత.. శివారాధనకు అత్యంత పవిత్రమైన రోజు

(తెలంగాణ ముచ్చట్లు ప్రత్యేకం)



కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైనదిగా భావించే కోటి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తిశ్రద్ధలతో కళకళలాడనున్నాయి. ఈ పవిత్రమైన రోజున పరమశివుడిని ఆరాధించడం, అభిషేకాలు, అర్చనలు, దీపారాధనలు నిర్వహించడం విశేష పుణ్యఫలాలను అందిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. హిందూ సంప్రదాయంలో కార్తీక మాసానికి ప్రత్యేక స్థానం ఉండగా, ఈ మాసంలో వచ్చే సోమవారాలు శివారాధనకు అత్యంత విశిష్టమైనవిగా భావిస్తారు. ముఖ్యంగా కోటి సోమవారం నాడు చేసే పూజలు, అభిషేకాలు, దానధర్మాలు కోటి రెట్ల పుణ్యఫలాన్ని అందిస్తాయని పురాణ విశ్వాసాలు చెబుతున్నాయి.

శివాభిషేకానికి ప్రత్యేక ప్రాధాన్యత

కార్తీక సోమవారం తెల్లవారుజామునే నిద్రలేచి పవిత్ర స్నానమాచరించి శివాలయాలను సందర్శించడం ఆనవాయితీ. శివలింగానికి శుద్ధజలం, పాలు, పెరుగు, తేనె, నెయ్యితో అభిషేకాలు నిర్వహించి, బిల్వపత్రాలను సమర్పిస్తారు. అనంతరం 'ఓం నమఃశివాయ' పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ పరమశివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. ఈ విధంగా శివనామస్మరణ చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చింతన, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు.

దీపారాధనతో ఆధ్యాత్మిక వెలుగులు

